సంపుటి :02 సంచిక :162 పేజీలు :06 వెల ₹5

# అక్షర దర్బార్

www.aksharadarbar.com

Voice of the people

సోమవారం 18, ఆగస్టు 2025




## తెలంగాణకు యూరియా వాటా ఇవ్వాలని ఎంపీల నిరసన

తెలంగాణలో రైతుల డిమాండ్ కు తగినంత యూరియా సప్లై చేయాలని ఢిల్లీలోని పార్లమెంట్ ఎదుట ధర్నా చేస్తున్న ఎంపీలు పోరిక బలరాం నాయక్, చామల కిరణ్ కుమార్ రెడ్డి, అనిల్ కుమార్ యాదవ్ తదితరులు..



## బీఆర్ఎస్ వల్లే బీసీ కోటాకు చిక్కులు

- వారి హయాంలో చేసిన చట్టమే అడ్డంకి
- కులగణనను రాజకీయ పార్టీలు వ్యతిరేకించవద్దు..
- ఒకవేళ అలా చేస్తే బీసీలకు అన్యాయం చేసినట్లే
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

02



## సీఎం రేవంత్‌రెడ్డిది అసమర్థ పాలన

- ప్రభుత్వ చేతగానితనంతో కేన్స్ పెట్టుబడులు గుజరాత్‌కు..
- యువత ఉద్యోగాల ఆశలపై నీళ్లు
- పదేళ్ల బీఆర్ ఎస్ శ్రమ బూడిదలో పోసిన పన్నీరు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శలు

04



# యూరియా కోసం రైతుల గోస

## మానుకోట జిల్లాలో ఎరువుల సమస్య తీవ్రం

సకాలంలో ఎరువు దొరక్క రైతన్న అగచాట్లు

పీఏసీఎస్‌లు, రైతువేదికలు, అగ్రికేంద్రాల వద్ద పడిగాపులు

- గూడూరు, నెల్లికుదురు మండలాల్లో రోడ్డెక్కిన రైతులు
- గంటల కొద్దీ ట్రాఫిక్ జాం.. పోలీసులు వారించినా వినని రైతాంగం
- కొన్నిచోట్ల బందోబస్తు మధ్య యూరియా సరఫరా

మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండల కేంద్రంలో యూరియా కోసం రాస్తారోకో చేస్తున్న రైతులు

కేసముద్రంలోని రైతువేదిక ఎదుట తెల్లవారుజామునే బారులు తీరిన మహిళా రైతులు

మహబూబాబాద్ జిల్లాలో యూరియా కొరత తీవ్రంగా ఉంది. డిమాండ్‌కు తగిన యూరియా సరఫరా లేకపోవడంతో క్షేత్రస్థాయిలో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మహిళా రైతులు సహా కోడి కూయకముందే రైతువేదికలు, పీఏసీఎస్‌లు, అగ్రి కేంద్రాల వద్ద బారులు తీరుతున్నారు. క్యూలైన్లలో చెప్పులు, ఆధార్ కార్డులు ఉంచుతున్నారు. గంటలు గంటలు క్యూలైన్లలో నించుకున్నా.. ఒక్క బస్తా యూరియా దొరకడం గగనంగా మారింది. సోమవారం నెల్లికుదురు మండల కేంద్రంలో యూరియా కోసం రాస్తారోకో చేపట్టారు. గూడూరు మండల కేంద్రంలో జాతీయ రహదారిపై యూరియా కోసం రహదారి దిగ్బంధం చేశారు. రైతుల ఆందోళనతో ఈ రెండు చోట్ల వాహన రాకపోకలు నిలిచిపోయాయి. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండల కేంద్రంలోనే ఇదే తరహా ఆందోళన జరిగింది. కొన్నిచోట్ల పోలీసుల బందోబస్తు మధ్య యూరియా సరఫరా చేయాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. రైతులు వర్షాన్ని లెక్క చేయకుండా యూరియా కోసం పోరాడుతున్నారు. పోలీసులు వారికి సర్ది చెప్పాలని చూస్తున్నారు. తమది లడాయి కాదని, ఆవేదన అని.. సమయానికి యూరియా అందకపోతే పంట చేతికి రాదని రైతులు వాపోతున్నారు.

– అక్షర దర్బార్, ప్రధాన ప్రతినిధి

02



కోటగుళ్లలో ఘనంగా

## నందీశ్వరుని 2వ వార్షికోత్సవం

- గణపేశ్వరునికి నందీశ్వరుడి కి రుద్రాభిషేకం
- స్వామివారికి బిల్వార్చన
- శ్రావణమాసం చివరి సోమవారం కావడంతో భారీగా తరలివచ్చిన భక్తులు

05

## రోడ్లపై ఉన్న పశువుల తరలింపు



05

- వారం రోజుల్లో కుక్కలు లేకుండా చేస్తాం
- మున్సిపల్ కమిషనర్ సుష్మ

అక్షర దర్బార్ ఎఫెక్ట్



# ప్రభుత్వాల నిర్లక్ష్యంతోనే
# రాకపోకల ఇబ్బందులు

- బీఎస్పీ నేత కొండా చరణ్
- భద్రాచలం అభివృద్ధి బీఎస్పీ అధికారంతోనే సాధ్యం

అక్షర దర్బార్, (నూగూరు) వెంకటాపురం : ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్లే ప్రజలు తీవ్ర రాకపోకల ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బహుజన సమాజ్ పార్టీ భద్రాచలం నియోజకవర్గ అధ్యక్షులు కొండా చరణ్ ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించిన ఆయన మాట్లాడుతూ, భారీ వర్షాల కారణంగా అనేక గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకుపోయాయని, అయితే ప్రభుత్వాల నిర్లక్ష్యం వలన మరెన్నో గ్రామాల్లో రాకపోకలు నిలిచిపోయాయని విమర్శించారు. వెంకటాపురం మండల కేంద్రానికి దగ్గరలోని కంకలవాగు వద్ద నిర్మాణంలో ఉన్న వంతెనను పూర్తి చేయకపోవడంతో కర్రవాణిగుప్ప, మల్లాపురం, రాచపల్లి, మోట్లగూడెం గ్రామాలు పూర్తిగా రాకపోకలు లేక ఇబ్బందులు పడుతున్నాయని ఆరోపించారు. భద్రాచలం నియోజకవర్గ అభివృద్ధి బీఎస్పీ అధికారంలోకి వచ్చినప్పుడే సాధ్యమవుతుందని అన్నారు. వెంకటాపురం మండల ప్రజలు బీఎస్పీని ఆదరించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీఎస్పీ నియోజకవర్గ ఉపాధ్యక్షులు సామల ప్రవీణ్, కార్యదర్శి గుండెల మధు, మండల అధ్యక్షులు సొల్లేటి గణేష్, కార్యదర్శి గుర్రాల విజయ్‌కుమార్, కోశాధికారి చెన్నం మోహన్, బహుజన్ వాలంటీర్ ఫోర్స్ కన్వీనర్ ములకల సందీప్ తదితరులు పాల్గొన్నారు.





# యూరియా కోసం రైతుల గోస



మహబూబాబాద్ జిల్లా గూడూరు మండల కేంద్రంలో జాతీయ రహదారిపై యూరియా కోసం రాస్తారోకో చేస్తున్న రైతులు

- పంట కాపాడుకునేందుకు పోరాటం
- సకాలంలో యూరియా దొరకక రైతన్నల ఆగచాట్లు
- మానుకోట జిల్లాలో ఎరువుల సమస్య తీవ్రం
- పీఏసీఎస్, రైతువేదికలు, అగ్రికేంద్రాల వద్ద పడిగాపులు
- గూడూరు, నెల్లికుదురు మండలాల్లో రోడ్డెక్కిన రైతులు
- గంటల కొద్దీ ట్రాఫిక్ జాం.. పోలీసులు వారించినా వినని రైతాంగం
- కొన్నిచోట్ల బందోబస్తు మధ్య యూరియా సరఫరా

అక్షరదర్బార్, ప్రధాన ప్రతినిధి: మహబూబాబాద్ జిల్లాలో యూరియా కొరత తీవ్రంగా ఉంది. యూరియా సరఫరా లేక, పంపిణీ జరగక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యతో రైతులు, మహిళా రైతులు తెల్లవారుజామునే రైతు వేదికలు, పీఏసీఎస్‌లు, అగ్రి కేంద్రాల వద్ద బారులు తీరుతున్నారు. యూరియా కావాలని డిమాండ్ చేస్తూ రాస్తారోకోలు, ఆందోళనలు నిర్వహిస్తున్నారు. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా యూరియా కోసం పోరాడుతున్నారు. పోలీసులు వారికి సర్దిచెప్పడానికి ప్రయత్నించినా, రైతులు వెనక్కి తగ్గడం లేదు. ప్రస్తుతం కూడా యూరియా కోసం రైతుల కష్టాలు కొనసాగుతున్నాయి. సొసైటీల వద్ద యూరియా నిల్వలు లేకపోవడం, ఒకవేళ ఉన్నా తక్కువ పరిమాణంలో ఉండటం నిరాశకు గురిచేస్తోంది. ప్రభుత్వం సొసైటీలకే ఎక్కువ కోటా కేటాయించడం, ప్రైవేట్ షాపుల్లో యూరియా లభించకపోవడం ఈ కొరతకు ప్రధాన కారణాలుగా రైతులు చెబుతున్నారు. ఒక బస్తా కోసం రోజుల తరబడి తిరగాల్సి వస్తోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### పెరుగుతున్న ఆందోళనలు

గూడూరు, నెల్లికుదురు, కేసముద్రం మండలాల్లో రైతులు ఆందోళనలను తీవ్రతరం చేశారు. సోమవారం నెల్లికుదురు మండల కేంద్రంలో యూరియా కోసం రాస్తారోకో చేపట్టారు. గూడూరు మండల కేంద్రంలో జాతీయ రహదారిపై యూరియా కోసం రహదారి దిగ్బంధం చేశారు. రైతుల ఆందోళనతో ఈ రెండు చోట్ల వాహన రాకపోకలు నిలిచిపోయాయి. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండల కేంద్రంలోనే ఇవే తరహా ఆందోళన జరిగింది. ఆదివారం ఇనుగుర్తి మండలంలో యూరియా స్టాక్ లేదని చెప్పడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేసి ఆందోళనకు దిగారు.

### -పార్టీలు, ప్రజాసంఘాల మద్దతు..

**యూరియా కొరతను నిరసిస్తూ కేసముద్రంలో బీఆర్ ఎస్ నాయకులు సైతం రాస్తారోకోలో పాల్గొన్నారు. రైతులు యూరియా కొరతను తక్షణమే పరిష్కరించాలని, ప్రైవేట్ షాపుల్లో కూడా విక్రయానికి అనుమతించాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వం తక్షణం స్పందించకపోతే రైతుల ఆందోళనలు మరింత ఉద్రిక్తతకు దారితీసే అవకాశం ఉంది. సకాలంలో యూరియా అందకపోతే పంట దిగుబడిపై తీవ్ర ప్రభావం పడుతుందని, ఇది రైతుల ఆర్థిక పరిస్థితిని మరింత దిగజార్చుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ సమస్యను పరిష్కరించడానికి ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని ప్రజలు, ప్రజా సంఘాలు కోరుతున్నాయి.**

### - మహిళల ఇబ్బందులు..

యూరియా కోసం మహిళలు తెల్లవారుజామునే గ్రామాల నుంచి మండల కేంద్రాలకు చేరుకుంటున్నారు. తిని తినకుండానే బయల్దేరి క్యూలైన్లలో నించుంటున్నారు. గంటలు గంటలు నిలబడి అలసిపోతున్నారు. తినడానికి వెళితే, క్యూలైన్లో మళ్లీ నిలబడాల్సి వస్తుందని, తిండి కూడా వెళ్లలేని పరిస్థితి. కాలకృత్యాలు తీర్చుకోవడం వారికి అతిపెద్ద సమస్యగా పరిణమించింది. మండల కేంద్రాల్లో పబ్లిక్ టాయిలెట్లు ఉండవు. ఉన్న ఆ పీఏసీఎస్లు, అగ్రి కేంద్రాలు, దుకాణాల్లో యజమానులు, అధికారులు, సిబ్బంది వరకే టాయిలెట్లు ఉంటాయి. ఇక యూరియా కోసం వచ్చే మహిళల సంగతేంటి.. వారి సమస్యల గురించి పట్టించుకునే నాథుడే లేదు. ఎండకి ఎండి వానకు తడిసినా, వారి సమస్యలకు పరిష్కారం దొరకదు.




నెల్లికుదురు మండల కేంద్రంలో యూరియా కోసం రాస్తారోకో చేస్తున్న రైతులు



కేసముద్రం మండల కేంద్రంలోని రైతువేదిక బారులుతీరిన మహిళా రైతులు

# బీఆర్ఎస్ వల్లే
# బీసీ కోటాకు చిక్కులు

- వారి హయాంలో చేసిన చట్టమే అడ్డంకి
- కులగణనను రాజకీయ పార్టీలు వ్యతిరేకించవద్దు..
- ఒకవేళ అలా చేస్తే బీసీలకు అన్యాయం చేసినట్లే
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



అక్షరదర్బార్, హైదరాబాద్: బీసీ రిజర్వేషన్ల అమలుకు గత ప్రభుత్వం తెచ్చిన చట్టం అడ్డంకిగా మారిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ప్రస్తుతం 50 శాతానికి మించి రిజర్వేషన్లు ఇవ్వడానికి ఆ చట్టం అడ్డుకుంటోందని ఆయన పేర్కొన్నారు. హైదరాబాద్లోని ట్యాంక్‌బండ్ సమీపంలో సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహానికి భూమిపూజ చేసి సీఎం మాట్లాడారు. దేశంలోనే తొలిసారిగా తెలంగాణలో చేపట్టిన కులగణనను వ్యతిరేకించవద్దని ఆయన రాజకీయ పార్టీలకు విజ్ఞప్తి చేశారు. కులగణనలో తప్పులున్నాయని నిరూపిస్తే, తాను క్షమాపణలు చెబుతానన్నారు. రాజకీయ పార్టీలు మద్దతు తెలుపకపోతే బహుజనులకు అన్యాయం చేసినట్టే అవుతుందని ఆయన స్పష్టం చేశారు. పాపన్నగౌడ్ బహుజనులకు ఆదర్శమని, ఆయన కోటను మైనింగ్ లీజుకు ఇవ్వడం ద్వారా చరిత్రను చెరిపేయాలని గత ప్రభుత్వాలు చూశాయని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఈ చారిత్రక ప్రదేశాన్ని భవిష్యత్తు తరాలకు స్ఫూర్తిగా నిలపడానికి కృషి చేస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన గాంధీ కుటుంబం దేశానికి చేసిన సేవలను ప్రశంసించారు. అలాగే, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామన్న రాహుల్ గాంధీ మాట శిలాశాసనమని పునరుద్ఘాటించారు.

# శాంతినగర్ అంగన్వాడీలో వైద్య శిబిరం



అక్షర దర్బార్, చిట్యాల : చిట్యాల మండలంలోని శాంతినగర్ గ్రామ అంగన్వాడీ కేంద్రంలో సోమవారం ప్రభుత్వ వైద్య శిబిరం నిర్వహించారు. ఐసిడిఎస్ సూపర్వైజర్ జయప్రద ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ రాకేష్ సీజన్ వ్యాధులపై జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలకు సూచించారు. వర్షాకాలంలో డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ వంటి వ్యాధులు రాకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఫినాయిల్, డెటాల్, బ్లీచింగ్ పౌడర్ వినియోగించాలని తెలిపారు. అనంతరం పిల్లలు, తల్లులకు ఆరోగ్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ రజిత, ఏఎన్ఎం, ఆశ వర్కర్ పాల్గొన్నారు.

## నిజమైన ప్రజా యోధుడు
# సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్



### : ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి

అక్షర దర్బార్, పరకాల : ప్రజల కోసం అణచివేతకు వ్యతిరేకంగా పోరాడిన సర్దార్ సర్వాయి పాపన్న నిజమైన ప్రజా యోధుడని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి అన్నారు. సోమవారం పరకాల పట్టణంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గౌడ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో జరిగిన సర్దార్ సర్వాయి పాపన్న జయంతి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాపన్న చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో పరకాల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చందుపట్ల రాజిరెడ్డి, కుంకుమేశ్వర ఆలయ చైర్మన్ కొలుగూరి రాజేశ్వరరావు, గౌడ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు, పరకాల కాంగ్రెస్ పార్టీ, పట్టణ, రూరల్ అధ్యక్షులు, ఎస్సీ, ఎస్టీ సంఘాల జాతీయ నాయకులు, గౌడ సంఘ నాయకులు తదితరులు పాల్గొన్నారు.





# స్థానిక పోరులో సత్తా చాటాలి

### : బీఆర్ఎస్ నేత నిమ్మగడ్డ వెంకటేశ్వరరావు

అక్షర దర్బార్, సంగెం : మండలంలోని నల్లబెల్లి, బాలునాయక్ తండా, నార్లవాయి, ముమ్మిడివరం, మొండ్రాయి, గొల్లపల్లి, పల్లార్ గూడ, వీఆర్ఎన్ తండా, పోచమ్మ తండా, వంజరపల్లి గ్రామాలలో బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి హాజరైన బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నిమ్మగడ్డ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, సర్పంచ్, ఎంపీటీసీ పదవీకాలం ముగిసి 20 నెలలు గడిచినా ఎన్నికలు జరపకపోవడం కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. మేనిఫెస్టోలో ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో ఒక్కటీ అమలు చేయలేక ప్రజలను మోసం చేశారని అన్నారు. రైతుబంధు, రైతు భీమా, కల్యాణలక్ష్మి, పింఛన్లు, ఇందిరమ్మ ఇండ్లు, మహిళలకు రూ.2500, గ్యాస్ సబ్సిడీ వంటి హామీలను అమలు చేయకుండా విస్మరించారని ఎద్దేవా చేశారు. కేసీఆర్ పాలనలో ఎప్పుడూ రైతులు యూరియాకు ఇబ్బంది పడలేదని, అయితే కాంగ్రెస్ పాలనలో బస్తా యూరియా కోసం రైతులు తిప్పలు పడుతున్నారని తెలిపారు. త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ కార్యకర్తలు సమిష్టిగా కృషి చేసి పార్టీ అభ్యర్థులను గెలిపించి సత్తా చాటాలని ఆయన పిలుపునిచ్చారు. కష్టకాలంలో పార్టీని వదిలిన వారిని తిరిగి చేర్చుకునే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు పసునూరి సారంగపాణి, మాజీ జడ్పీటీసీ గూడ సుదర్శన్ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ బుక్క మల్లయ్య, సంగెం సొసైటీ చైర్మన్ వేల్పుల కుమారస్వామి, పూజారి గోవర్ధన్, కక్కెర్ల సదానందం, మన్సూర్ అలీ, యూత్ నాయకులు పెండ్లి పురుషోత్తం రెడ్డి, బొమ్మల శంకర్, పోశాల ప్రవీణ్, తోట ప్రభాకర్, గ్రామ సర్పంచులు, ఎంపీటీసీలు, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.




# భక్తి శ్రద్ధలతో గణేష్ నవ రాత్రులు జరుపుకుందాం

### : సీపీ సన్ ప్రీత్ సింగ్

అక్షర దర్బార్, హనుమకొండ :గణేష్ మండపాలను ఏర్పాటు చేసే నిర్వాహకులు తప్పనిసరిగా పోలీసుల అనుమతి తీసుకోవాలని, భక్తి శ్రద్ధలతో వినాయక నవ రాత్రులు నిర్వహించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ సూచించారు.ట్రైసిటీ పరిధిలో గణేష్ మండపాలు ఏర్పాటు చేయాలనుకునే నిర్వాహకులు https://policeportal.tspolice.gov.in వెబ్‌సైట్‌లో ప్రతిమ ఎత్తు, స్థలం, నిమజ్జనం తేదీ వంటి వివరాలతో నమోదు చేసుకుని ఆన్‌లైన్‌లో అనుమతులు పొందాలని తెలిపారు.మండపాలు ఎవరికి ఇబ్బంది కలగకుండా ఏర్పాటు చేయాలని, విద్యుత్ కనెక్షన్లు అధికారుల అనుమతితో తీసుకోవాలని, మంచి నాణ్యత గల వైరింగ్ వాడాలని సూచించారు. రాత్రి 10 గంటల వరకు మాత్రమే స్పీకర్లను వాడుకోవచ్చని, డీజేలు పూర్తిగా నిషేధమని స్పష్టం చేశారు.మండపాల్లో 24 గంటలు వాలంటీర్ ఉండేలా చూడాలని, క్యూలైన్లు, అగ్నిమాపక ముందు జాగ్రత్తలు ఏర్పాటు చేయాలని సూచించారు. మండపాల వద్ద మద్యం, పేకాట, లక్కీ డ్రా, అసభ్య నృత్యాలు, ఇతర మతాలను కించపరిచే ప్రసంగాలు, పాటలు కఠినంగా నిషేధమని హెచ్చరించారు.ఏదైనా అనుమానాస్పద వస్తువులు లేదా వ్యక్తులు కనిపించిన వెంటనే డయల్ 100కు సమాచారం అందించాలని సీపీ నిర్వాహకులను ఆదేశించారు.

# స్థానిక పోరులో ఘనవిజయం సాధించాలి

### : ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి

అక్షర దర్బార్, పరకాల: స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అన్ని స్థానాల్లో ఘనవిజయం సాధించాలని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం పరకాల ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో పరకాల పట్టణ, మండలం, నడికూడ, దామెర, ఆత్మకూరు మండల సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ప్రజల సంక్షేమానికే ప్రాధాన్యం ఇస్తుంది" అని అన్నారు. ప్రతి వారం గ్రామాల్లో సమావేశాలు నిర్వహించి, స్థానిక రాజకీయ పరిస్థితులను సమీక్షించాలని సూచించారు. పాత,కొత్త తేడా లేకుండా అందరూ కలిసికట్టుగా కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేయాలని కోరారు. త్వరలోనే భారీగా పార్టీలో చేరికలు జరగనున్నాయని వెల్లడించారు.




# ఆగివున్న లారీని ఢీకొన్న ఆర్టీసీ బస్సు

### ప్రయాణికులకు స్వల్ప గాయాలు

అక్షర దర్బార్ శాయంపేట : రోడ్డుమీద ఆగి ఉన్న లారీని బస్సు ఢీకొనడంతో బస్సు ముందు భాగం దెబ్బతిని పలువురికి స్వల్ప గాయాలైనట్లు శాయంపేట ఎస్సై జె పరమేశ్వర్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. శాయంపేట మండలం కొత్తగట్టు సింగారం సమీపంలో ప్రధాన రహదారిపై లారీ టైర్ పంచర్ అయి ఆగి ఉంది. ఈ క్రమంలో అదే రోడ్డుపై వస్తున్న ఆర్టీసీ బస్సు వెనక నుంచి ఢీకొట్టింది. దీంతో బస్సు ముందు భాగం పూర్తిగా దెబ్బతింది. ప్రమాద సమయంలో బస్సులో ఉన్న 11 మంది ప్రయాణికులు స్వల్పంగా గాయపడగా, వారిని ఎంజీఎంకు తరలించారు. ఆగివున్న లారీ ఎలాంటి ఇండికేటర్లు, సూచిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడం వల్లే ప్రమాదం జరిగినట్లు స్థానికులు తెలిపారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ఆర్టీసీ డ్రైవర్ ఫిర్యాదు మేరకు లారీ డ్రైవర్ పై కేసు నమోదు చేశారు.

# బాధితులు నిర్భయంగా సమస్యలు చెప్పండి

### - ఎస్పీ కిరణ్ ఖరే



అక్షర దర్బార్, భూపాలపల్లి క్రైమ్: బాధితులు నిర్భయంగా, స్వేచ్ఛగా తమ సమస్యలను పోలీసులకు తెలపాలని జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పీ కిరణ్ ఖేరే అన్నారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజా దివస్ కార్యక్రమంలో భాగంగా వివిధ మండలాల నుంచి వచ్చిన 18 మంది నుంచి పిర్యాదులు స్వీకరించి, పలువురు బాధితులతో మాట్లాడి, వారి సమస్యలు విని అక్కడికక్కడే సంబంధిత పోలీస్ అధికారులకు ఫోన్ చేసి ఫిర్యాదులపై చట్టపరంగా చర్యలు తీసుకుని, న్యాయం చేయాలని ఆదేశాలు జారీ చేశారు.

# పాలన చేతకాకపోతే రాజీనామా చెయ్

- గ్రామాల అభివృద్ధిని గాలికి వదిలేసిన ఎమ్మెల్యే
- గడ్డం నాగార్జున



అక్షర దర్బార్, కేసముద్రం : మానుకోట ఎమ్మెల్యే గ్రామాల అభివృద్ధిని గాలికి వదిలేశారని, పాలన చేయలేకపోతే రాజీనామా చేయాలని ఎంసిపిఐయు రాష్ట్ర కమిటీ సభ్యులు గడ్డం నాగార్జున డిమాండ్ చేశారు. సోమవారం కేసముద్రం మండలంలోని కాట్రపల్లి గ్రామంలో పత్రిక ప్రకటన విడుదల చేసిన ఆయన మాట్లాడుతూ, కాట్రపల్లి సహా పలు గ్రామాల్లో రోడ్లు బురదమయమై ప్రజలు నరకయాతన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణ కేంద్రంలో కూడా రోడ్ల పరిస్థితి దయనీయంగా ఉందని విమర్శించారు. ప్రకటనలకే పరిమితమై, ప్రజలకు ఉపయోగపడే పనులు చేయలేకపోతున్నారని మండిపడ్డారు. ప్రభుత్వ సలహాదారు వేంనరేందర్ రెడ్డికి సమస్యలు తెలియజేసినా, నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ నాయకులు వర్గపోరాటాలకే పరిమితమై, ప్రజల సమస్యలపై శ్రద్ధ చూపడం లేదని దుయ్యబట్టారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి గ్రామాల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని, లేకపోతే రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్తారని హెచ్చరించారు.

## మహాధర్నా క్యాలెండర్ ఆవిష్కరణ



అక్షర దర్బార్ శాయంపేట : పీఆర్టీయూ టీఎస్ శాయంపేట మండల శాఖ ఆధ్వర్యంలో మండల విద్యా వనరుల కేంద్రంలో సెప్టెంబర్ 1న సీపీఎస్ విద్రోహ దినంగా ఇందిరాపార్క్ హైదరాబాద్ ల మహాధర్నా క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. కార్యక్రమంలో మండల అధ్యక్షులు తోట యుగంధర్ మాట్లాడుతూ పెన్షన్ అనేది ఉద్యోగి హక్కు అని ఎటువంటి సదుపాయాలులేని సిపిఎస్ రద్దు చేయాలని ఉపాధ్యాయ మిత్రులు అధిక సంఖ్యలో పాల్గొని ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి బానోతు సుధాకర్ రాథోడ్, మండల విద్యాధికారి గడ్డం భిక్షపతి, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు టీ.శ్రీనివాస్, చల్ల రాజిరెడ్డి, కె.సంధ్య , జిల్లా కార్యదర్శి యం.సురేందర్ , కె.కిరణ్మయి, సీనియర్ పీఆర్టీయూ టీఎస్ సభ్యులు పాల్గొన్నారు.

## వరద నీరు తొలగింపు



అక్షర దర్బార్ (నూగూరు) వెంకటాపురం : మండలంలోని వీఆర్కేపురం పరిధిలోని చొక్కాల గ్రామంలో భారీ వర్షాలకు పలు ఇండ్లు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. రైతుల మిరప నారుమడులు నీట మునిగాయి. గ్రామస్తులు పంచాయతీ కార్యదర్శి రాజేందర్ కు సమాచారం అందించడంతో కార్యదర్శి వెంటనే స్పందించి జేసీబీ సాయంతో వరద నీటికి శాశ్వత పరిష్కారం చేపట్టారు. సమస్యని పరిష్కరించిన కార్యదర్శికి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర వాడ బలిజ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు దర్ర దామోదర్, గ్రామస్తులు పాల్గొన్నారు.



## భౌతిక దాడులు సరికాదు

### : బీసీ పొలిటికల్ జేఏసీ జిల్లా ఇన్చార్జ్ రవి పటేల్

అక్షర దర్బార్, చిట్యాల : చిట్యాల మండలం కాల్వపల్లి గ్రామానికి చెందిన పంచిని మహేష్ యాదవ్ కుటుంబంపై జరిగిన భౌతిక దాడులను తీన్మార్ మల్లన్న బీసీ పొలిటికల్ జేఏసీ జిల్లా ఇన్చార్జ్ రవి పటేల్ తీవ్రంగా ఖండించారు. సోమవారం మండల కేంద్రంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. భూమి వివాదాన్ని ప్రశ్నించినందుకే మహేష్ కుటుంబంపై దాడి జరిగిందని అన్నారు. గుడి నిర్మాణం లేదా ఇతర సమస్యలు ఉంటే పెద్దమనుషుల సమక్షంలో మాట్లాడుకోవాలి కాని దాడులకు పాల్పడటం సరికాదని హెచ్చరించారు. మహేష్ యాదవ్ స్థానిక ఎన్నికల్లో పోటీ చేస్తున్నాడనే అక్కసుతోనే అగ్రవర్ణాలు దాడులకు పాల్పడ్డాయని ఆరోపిస్తూ, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో మహేష్‌ను బీసీ పొలిటికల్ జేఏసీ అభ్యర్థిగా నిలబెట్టి గెలిపిస్తామని రవి పటేల్ తెలిపారు. కార్యక్రమంలో రోడ్డ శ్రీను, ప్రణీత్, వెంకటేష్, అఖిల్, సమిరెడ్డి మహేష్ తదితరులు పాల్గొన్నారు.



## సీఎం రేవంత్ రెడ్డిది

# అసమర్థ పాలన

- ప్రభుత్వ చేతగానితనంతో కేన్స్ పెట్టుబడులు గుజరాత్ కు..
- యువత ఉద్యోగాల ఆశలపై నీళ్లు
- పదేళ్ల బీఆర్ఎస్ శ్రమ బూడిదలో పోసిన పన్నీరు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శలు



అక్షరదర్బార్, హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసమర్థత, చేతకాని పాలన కారణంగానే తెలంగాణ నుంచి పరిశ్రమలు తరలిపోతున్నాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సోమవారం ఎక్స్ వేదికగా ధ్వజమెత్తారు. కాంగ్రెస్ పాలనలో తెలంగాణలో రూ.2,800 కోట్ల పెట్టుబడి పెట్టాల్సిన 'కేన్స్' సంస్థ గుజరాత్‌కు వెళ్లిపోయిందని, దీనివల్ల ప్రత్యక్షంగా 2,000 మంది తెలంగాణ యువతకు ఉద్యోగాలు గండిపడ్డాయని దుయ్యబట్టారు. దీంతో పదేళ్ల బీఆర్ఎస్ శ్రమ బూడిదలో పోసిన పన్నీరైందని వాపోయారు. సీఎం రేవంత్ రెడ్డి తెలంగాణను ఢిల్లీకి ఏటీఎంలా వాడుకుంటున్నారని ఆరోపించారు. మరోవైపు మున్సిపల్, ఆరోగ్య శాఖల మధ్య సమన్వయ లోపం కారణంగా హైదరాబాద్‌తో సహా రాష్ట్రంలోని ఇతర పట్టణాలు మురుగు నీరు, చెత్తకుప్పలతో నిండిపోయాయని పేర్కొన్నారు. అపారిశుద్ధ్యం కారణంగా వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మండిపడ్డారు. ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులు రోగులతో కిటకిటలాడుతున్నాయని ఆయన పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో వర్షాకాలానికి రెండు నెలల ముందే సీజనల్ వ్యాధులపై సమీక్షలు నిర్వహించి ముందస్తు చర్యలు తీసుకునేవాళ్లమని, కానీ ఇప్పుడు అలాంటి పరిస్థితులు కనిపించడం లేదని ధ్వజమెత్తారు. ప్రజలు అలమటిస్తుంటే పాలకులు మాత్రం "ఆర్ఆర్ ట్యాక్స్" వసూళ్లలో బిజీగా ఉన్నారని ఆయన విమర్శించారు.

## వెంకటాపురం పీఎస్ లో ఏఎస్పీ తనిఖీ..

. అక్షర దర్బార్ (నూగూరు) వెంకటాపురం : వెంకటాపురం పోలీస్ స్టేషన్ ను ఏటూరునాగారం ఏఎస్పీ శివం ఉపాధ్యాయ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో భాగంగా పోలీస్ స్టేషన్ పనితీరుపై ఆరా తీశారు. పలు రికార్డులను పరిశీలించారు. అలాగే సిబ్బంది పనితీరుపై సమీక్ష నిర్వహించారు. మావోయిస్టుల కదలికలపై ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో సీఐ ముత్యం రమేష్, ఎస్సై కొప్పుల తిరుపతిరావు, ప్రొబేషనరీ ఎస్ఐ తిరుపతి రెడ్డి, పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.







## ఘనంగా సర్దార్ పాపన్న

# జయంతి వేడుకలు

అక్షర దర్బార్, చిట్యాల : బహుజన వీరుడు, తొలి తెలుగు చక్రవర్తి సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 375వ జయంతి వేడుకలు చిట్యాల, గోపాల్పూర్‌లో గౌడ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు బుర్ర లక్ష్మణ్ గౌడ్, నేతలు బత్తిని నారాయణ గౌడ్ తదితరులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నిజాం నిరంకుశత్వాన్ని, భూస్వాముల దోపిడీని ఎదిరించి అణగారిన వర్గాలకు ఆత్మగౌరవం చాటిన తొలి బహుజన చక్రవర్తిగా ఆయనను స్మరించారు. కార్యక్రమంలో పెరుమాళ్ల రాజు గౌడ్, బుర్ర సదయ్య గౌడ్, గొల్లపల్లి సాంబయ్య గౌడ్, గుర్రపు రాజు గౌడ్, పెరుమళ్ళ రవీందర్ గౌడ్, బుర్ర రమేష్ గౌడ్, ఉయ్యాల రమేష్ గౌడ్, వల్లాల ప్రవీణ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే గ్రామ పెద్దలు పోశాల రాజు, పోశాల పైడయ్య, పులి కిరణ్, కోరుకోప్పుల అశోక్, కోల వేంకటేష్, మూల పైడయ్య, కోల మొగిలి తదితరులు హాజరయ్యారు.

## అత్యాచారం నిందితుడికి

# 20 ఏళ్ల జైలు శిక్ష

అక్షరదర్బార్, హనుమకొండ:మైనర్ బాలికపై అత్యాచారం చేసిన నిందితుడికి 20 సంవత్సరాల జైలు శిక్ష రూ.15 వేల జరిమానా విధిస్తూ ఒకటో వాదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి అపర్ణాదేవి సోమవారం తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం మహబూబాద్ జిల్లా చిన్నగూడూరు మండలం బయ్యారం చిన్న తండాకు చెందిన బాధితురాలు బతుకుదెరువు కోసం కాజీపేట డీజిల్ కాలనీ ప్రాంతంలో మొక్కజొన్న కంకులు కాల్చి అమ్ముచుండేది. ఈమెకు నలుగురు ఆడపిల్లలు. ముగ్గురు అమ్మాయిల పెళ్లి జరిగింది. చిన్న కూతురు ఏడో తరగతి వరకు చదువుకొని ఇంటి వద్దనే ఉంటుంది. అప్పుడప్పుడు తల్లి వద్ద పనులు నిర్వహిస్తూ ఉండేది. ఈ క్రమంలో పర్వతగిరి మండలం అన్నారం తండాకు చెందిన నిందితుడు వాంకుడు చంద్రుడు (23) మైనర్ బాలికతో పరిచయం పెంచుకొని 2022 డిసెంబర్ 15న రాత్రి 11.45 గంటలకు ఫోన్ చేసి ఆమెను బయటికి తీసుకెళ్లాడు. తన కూతురు కోసం తల్లి వెతకగా నిందితుడు ఆమెను రోడ్డుపై వదిలేసి వెళ్లాడు. ఈ విషయమై ఎవరికైనా చెబితే నీవు నాతో తీసుకున్న ఫొటోలు అందరికీ చూపిస్తానని భయపెట్టి పలుమార్లు అత్యాచారానికి పాల్పడినట్లు బాధితురాలు కాజీపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ జి.మహేందర్ రెడ్డి కేసు నమోదు చేసి కోర్టులో చార్జ్ షీట్ దాఖలు చేశారు. ఈ కేసులో ప్రస్తుతం ఉన్న ఇన్‌స్పెక్టర్ వై.సుధాకర్ రెడ్డి, కోర్టు కానిస్టేబుల్ ఏరుకొండ సుధాకర్. కోర్టు లెసన్ ఆఫీసర్ ఏఎస్ఐ పరమేశ్వరి సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టారు. 15 మంది సాక్షులకు హోంగార్డ్ అనిల్ సామాన్లు జారీ చేశారు. ప్రాసిక్యూషన్ తరపున పబ్లిక్ ప్రాసెసర్ బి మల్లారెడ్డి వాదించారు. వాద ప్రతివాదాలు విన్న అనంతరం న్యాయమూర్తి పైతీర్పునిచ్చారు.

# విద్యుత్ పట్ల జాగ్రత్తగా ఉండాలి

## శాయంపేట ఏఈ చందూలాల్

అక్షర దర్బార్ శాయంపేట : వర్షాకాలంలో విద్యుత్ పట్ల జాగ్రత్తగా ఉండాలని శాయంపేట ఏఈ చందూలాల్ తెలిపారు.ఈ సందర్భంగా అధికారులు విద్యుత్ ప్రమాదాల ప్రధాన కారణాలు మరియు జాగ్రత్తలను వివరించారు.తడిచిన చేతులతో విద్యుత్ పరికరాలు తాకరాదు.వర్షాకాలంలో కరెంట్ స్తంభాలను పట్టుకోరాదు.పడిపోయిన విద్యుత్ తీగలకు దగ్గరగా వెళ్లరాదు, తాకరాదు.పవర్ లైన్ దగ్గర గాలిపటాలు ఎగరేయరాదు.కరెంట్ ఉన్న తీగల దగ్గర ఇనుప దండలు వాడరాదు.వాటర్ హీటర్, చార్జర్ వైర్లను చిన్నపిల్లలకు అందుబాటులో ఉంచరాదు.నాసిరకం వైర్లు, స్విచ్ బోర్డులు వాడరాదు.ఇంటి పరికరాలకు ఎర్తింగ్ తప్పనిసరిగా చేయించుకోవాలి.ఛార్జింగ్ పెడుతూ ఫోన్ మాట్లాడరాదు లేదా ఆటలు ఆడరాదు.చిన్నపిల్లలు స్విచ్ బోర్డుల దగ్గరకు వెళ్లకుండా చూడాలి.ట్రాన్స్ఫార్మర్ల దగ్గర పశువులను మేపరాదు.పంటచేలకు కరెంట్ ఫెన్సింగ్ వాడరాదు.ఇనుప స్టార్టర్ బాక్సులను వాడరాదు.కరెంట్ లైన్ల క్రింద నిర్మాణాలు చేయరాదు.ఇంటి దగ్గర కరెంట్ వాడకానికి కోక్కాలు వాడరాదు. సర్వీస్ వైర్‌ను అధికారుల ద్వారా కనెక్ట్ చేయించుకోవాలి.ట్రాన్స్ఫార్మర్ రిపేర్‌ను రైతులు స్వయంగా చేయరాదు.అధికారులు వచ్చే వరకు వేచి ఉండాలి.మోటార్ సర్వీస్ వైర్లు కరెంట్ లైన్‌కు కనెక్ట్ చేసేటపుడు, మూడు వైర్లను ఒకే సమయంలో కలిపి, ఒక మీటర్ దూరంలో ముడివేయాలి; విడిగా తగిలించరాదు.

### ప్రమాదం జరిగినప్పుడు చేయాల్సిన పని

ప్రమాదంలో ఉన్న మనిషి/జంతువు/వస్తువును నేరుగా తాకరాదు. పొడి కర్ర, ప్లాస్టిక్ పైప్ లేదా ఇన్సులేటెడ్ వస్తువు ద్వారా మాత్రమే వేరుచేయాలి.వెంటనే ఆసుపత్రికి తరలించి వైద్యం అందించాలి.ఎలాంటి విద్యుత్ సమస్యలకైనా టోల్‌ఫ్రీ నంబర్ 1912 కి సమాచారం ఇవ్వాలి.





# రోడ్లపై పశువుల తరలింపు

- వారం రోజుల్లో కుక్కలు లేకుండా చేస్తాం
- మున్సిపల్ కమిషనర్ సుష్మ
- 'అక్షరదర్బార్' ఎఫెక్ట్



అటు కుక్కల గోల, ఇటు పశువుల బెడద

- ప్రమాదాలకు నిలయంగా మారిన బస్టాండ్ కూడలి
- మున్సిపల్ అధికారులు పట్టించుకోవాలి

అక్షర దర్బార్, పరకాల: పరకాల పట్టణంలోని రోడ్లపై కుక్కలు పశువుల సంచారంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. పరకాల బస్టాండ్ కూడాలలో సాయంత్ర మైతే ఇటు కుక్కలు అటు పశువులు గుంపులు గుంపులుగా రోడ్లపై నిలబడి ప్రయాణికులకు తీవ్ర ఇ దులకు గురిచేస్తున్నాయి. కుక్కలు బస్టాండ్ కూడలి గుంపులు గుంపులుగా తిరుగుతూ ప్రజలను భయ లకు గురిచేస్తున్నాయి. ఒక్కసారిగా పరిగెత్తి ఏ బండి వెళ్తుతాయో అని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నార పరకాల పట్టణంలో దాదాపు రెండు మూడువందల కుక్కలు ఉన్నట్లు ప్రజలు పేర్కొంటున్నారు. అదేవిధ పశువులను వాటి యజమానులు పట్టించుకోకుండా రోడ్లపై వదిలివేయడంతో రాత్రి వేళలో అవి రోడ్లపై పడుకొని ప్రమాదలకు గురి చేస్తున్నాయని ప్రజలు టున్నారు. పశువులు, కుక్కలపై మున్సిపల్ అధికార చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు

అక్షర దర్బార్ voice of the peopl
16 Aug 2025 - Page 5
https://www.aksharadarbar.com/epaper/clip/17406




అక్షరదర్బార్, పరకాల: పరకాల మున్సిపల్ కమిషనర్ సుష్మ సోమవారం ఉదయం పరకాల పట్టణంలో తిరుగుతూ రోడ్లపై ఉన్న పశువులను మున్సిపల్ సిబ్బందితో పాత మున్సిపల్ కార్యాలయంలో ఉన్న బంజర దొడ్డిలోకి తరలించారు. శనివారం 'అక్షరదర్బార్' పత్రికలో కుక్కల గోల, పశువుల బెడద, ప్రమాదాలకు నిలయంగా మారిన బస్టాండ్ కూడలి. మున్సిపల్ అధికారులు పట్టించుకోవాలి. శీర్షికన ప్రచురితమైన కథనానికి మున్సిపల్ అధికారులు స్పందించి పశువులను తరలించారు. పరకాల బస్టాండ్ కూడలిలో సాయంత్రమైతే ఇటు కుక్కలు అటు పశువులు గుంపులు గుంపులుగా రోడ్లపై తిరుగుతూ ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. దానితో స్పందించి మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టారు.

### - గతం రిపీట్ కాకుండా చూసేనా..

పరకాల మున్సిపాలిటీ కార్యాలయంలో గతంలో మున్సిపల్ కమిషనర్ గా పనిచేసిన శేషంజనేయులు రోడ్లపై తిరుగుతున్న పశువులను పట్టుకొని బంజర దొడ్డిలో తోలి చుట్టుపక్కల గ్రామాల్లో రైతులకు ఉచితంగా పశువులను ఇస్తానని ప్రకటన చేయడంతో పలువురు రైతులు



దరఖాస్తు చేసుకోగా వారికి పశువులను ఇచ్చేందుకు సిద్ధమయ్యారు. అలాంటి తరుణంలో రాజకీయ నాయకుల ఒత్తిళ్లకు తలొగ్గి మళ్లీ ఎవరికి ఇవ్వకుండా పరకాల పట్టణంలోని యజమానులకు ఇవ్వడంతో వారు మళ్ళీ రోడ్లపై వదిలేయడం జరిగింది. దీంతో ఇప్పటివరకు వాటిని పట్టించుకోని యజమానులు ఇటు మున్సిపల్ అధికారులు శనివారం 'అక్షరదర్బార్' పత్రిక ప్రచురించడంతో మున్సిపల్ కమిషనర్ సుష్మ పట్టించుకోని పకడ్బందీగా చర్యలు తీసుకున్నారు. కానీ, ఈ చర్యలు రాజకీయ నాయకుల ఒత్తిళ్లతో ముందుకు పోతాయా లేదా అనేది అగమ్య గోచరంగా ఉందని పలువురు పేర్కొంటున్నారు. పరకాల ఎమ్మెల్యే పట్టించుకుంటేనే వీటికి శాశ్వత పరిష్కారం దొరుకుతుందని ప్రజలు ఎదురుచూస్తున్నారు.

### - వారం రోజుల్లో కుక్కలు లేకుండా చేస్తాం.




పరకాల మున్సిపల్ కమిషనర్ సుష్మను అక్షర్ దర్బార్ పత్రిక విలేఖరి వివరణ కోరగా పట్టణంలో ఉన్న పశువులను సోమవారం పట్టుకోవడం జరిగిందని, అదేవిధంగా వారం రోజులలో పరకాల పట్టణంలో ఉన్న కుక్కలను పట్టుకొని తరలించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని గుంటూరులో కుక్కల్ని పట్టే వారికి సమాచారం అందించామని త్వరలో వారు వచ్చి కుక్కలను పట్టుకొని వెళ్తారని తెలిపారు.



## ఘనంగా నందీశ్వరుడి

# 2వ వార్షికోత్సవం

- గణపేశ్వరునికి నందీశ్వరుడికి రుద్రాభిషేకం
- స్వామివారికి బిల్వార్చన
- శ్రావణమాసం చివరి సోమవారం కావడంతో భారీగా భక్తులు

అక్షరదర్బార్, గణపురం: కాకతీయుల కళాక్షేత్రం శ్రీ భవాని సహిత గణపేశ్వరాలయం కోటగుళ్ళలో శ్రావణమాసం చివరి సోమవారం నందీశ్వరుని రెండవ వార్షికోత్సవాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. ఉదయం గణపతి పూజతో కార్యక్రమాలను ఆలయ అర్చకులు జూలపల్లి నాగరాజు, సాయిబాబా దేవాలయ అర్చకులు వినయ్ లు పూజా కార్యక్రమాలను ప్రారంభించారు. 2023 ఆగస్టు 18 న నిజామాబాద్ సిపి పోతరాజు సాయి చైతన్య కీర్తి దంపతుల ఆధ్వర్యంలో నందీశ్వరుని ప్రతిష్టాపన కార్యక్రమం జరిగింది. ప్రతిష్టాపన కార్యక్రమం నిర్వహించి రెండు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా సోమవారం రెండవ వార్షికోత్సవం కోటగుళ్లు పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో కన్నుల పండుగ గా నిర్వహించారు. ఈ సందర్భంగా నందీశ్వరునికి గణపేశ్వరునికి రుద్రాభిషేకం త్రివేణి సంగమం జలాభిషేకం నిర్వహించారు. అభిషేకం అనంతరం పూలమాలలో పట్టు వస్త్రాలతో ప్రత్యేకంగా అలంకరించారు. శ్రావణ మాసం చివరి సోమవారం కావడంతో వివిధ ప్రాంతాల నుండి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి నందీశ్వరుని వార్షికోత్సవంలో పాల్గొన్నారు. పూజా కార్యక్రమాలు అనంతరం ఆలయ అర్చకులు జూలపల్లి నాగరాజు భక్తులకు ఆశీర్వచనాలు తీర్థప్రసాదాలు మహిళలకు అమ్మవారి గాజులను అందజేశారు. ఆలయంలో నందీశ్వరుని ప్రతిష్టించిన నిజామాబాద్ సిపి పోతరాజు సాయి చైతన్య, కీర్తి దంపతులకు కోటగుళ్ల పరిరక్షణ కమిటీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపింది.




## తెలంగాణకు యూరియా

# వాటా ఇవ్వండి

### పార్లమెంట్ ఎదుట ఎంపీల నిరసన

తెలంగాణలో రైతుల డిమాండ్ కు తగినంత యూరియా సప్లయ్ చేయాలని ఢిల్లీలోని పార్లమెంట్ ఎదుట ధర్నా చేస్తున్న ఎంపీలు పోరిక బలరాం నాయక్, చామల కిరణ్ కుమార్ రెడ్డి, అనిల్ కుమార్ యాదవ్ తదితరులు..




# మీ గొంతుక!
# మీ నమ్మకం!

## అక్షర దర్బార్

ప్రతి అక్షరం.. ప్రజా సంక్షేమం!

## ఎందుకు అక్షర దర్బార్?

- **నిజమైన వార్తలు** : నిష్పక్షపాతంగా, పారదర్శకంగా వార్తలను అందిస్తాం.
- **మీ సమస్యల పరిష్కారం** : స్థానిక సమస్యల నుండి ప్రభుత్వ పథకాల అమలు వరకు, మీ ప్రతి సమస్యను వెలుగులోకి తెస్తాం.
- **సమాజహితమే లక్ష్యం** : ప్రజల గొంతుకగా మారి, సామాజిక బాధ్యతతో పనిచేస్తాం.
- **ఈ-పేపర్ అందుబాటులో** : ఎక్కడ ఉన్నా, ఎప్పుడైనా మీ వార్తలను చదవండి.

డిజిటల్ విప్లవంలో భాగంకండి!

"అక్షర దర్బార్" ఈ-పేపర్ కోసం QR కోడ్‌ను స్కాన్ చేయండి.
వేగంగా, సులభంగా వార్తలను పొందండి.

**ప్రతిరోజూ మీ ఇంటికి, మీ మనసుకి చేరువగా "అక్షర దర్బార్"!**

**మీ నమ్మకమే మా బలం!**


Printed, Published & Owned by VEMULA RAJESHWER RAO, printed at VR PUBLICATIONS, H.NO 7-1-364/16/A, Sriram Nagar, Padmakshi gutta colony, Hanamkonda, Pin 506001, Telangana State.
Editor : VEMULA RAJESHWAR RAO, Email : akshardarbarnews@gmail.com, Office No:7680992278 *RNI N0.TELTEL/2022/81915